క్లుప్తంగా

ఏపీడీ బాధ్యతల స్వీకరణ



ఉదయగిరి: ఉపాధి హామీ పథకం ఉదయగిరి క్లస్టర్ ఏపీడీగా ఎం మృదుల బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కోవూరు క్లస్టర్‌కు రెగ్యులర్, కావలి క్లస్టర్‌కు ఇన్‌చార్జి ఏపీడీగా వ్యవహరిస్తున్న ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా ఉదయగిరికి వచ్చారు. కాగా తొలిరోజు ఆమె స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, సీతారామపురం మండలాల ఏపీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి పనుల నిర్వహణపై సూచనలు చేశారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ. 280

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం కిలో పొగాకు గరిష్ఠంగా రూ. 280. ధర పలికింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 296 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, 239 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 57 బేళ్లను కొనుగోలుకు తిరస్కరించారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ. 280, కనిష్ఠంగా రూ. 235, సరాసరిన రూ. 272.35 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి వీ మహేష్‌కుమార్ తెలిపారు. కాగా వేలంలో 8 కంపెనీలు పాల్గొన్నాయి.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతికి నివాళి



ఉదయగిరి: పట్టణంలోని కంసలివీధికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కల్లూరి నారాయణరెడ్డి బుధవారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని యూటీఎఫ్ మండల నాయకులు సందర్శించి నివాళులర్పించింది. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయకులు కే చంద్రశేఖరరెడ్డి, దస్తగిరిఅహ్మద్, సుబ్బా రెడ్డి, ఫణిరాజ్, రామిరెడ్డి, ఏడుకొండలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మినీ వాటర్ స్కీమ్‌కు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్..

సీతారామపురం : మండలంలోని పడమటి రొంపిదొడ్లలో మరమ్మతులకు గురైన మినీ వాటర్ స్కీమ్‌కు బుధవారం మరమ్మతులు చేపట్టారు. మినీవాటర్ స్కీం మరమ్మతులకు గురవడంతో స్థానికులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై 'సాక్షి'లో సోమవారం కథనం వెలువడడంతో బసినేనిపల్లి పంచాయతీ సర్పంచ్ పల్లె విజయమ్మ స్పందించారు. యుద్ధప్రాతిపదికన పాతమోటార్ స్థానంలో కొత్త మోటార్‌ను బిగించారు. దీంతో గ్రామస్తులు సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు.

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోండి



కలిగిరి: గ్రామీణ ప్రాంత ప్రజలు పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తపాల శాఖ ఏఎస్పీ ఆర్ మల్లేశ్వరరావు కోరారు. సిద్ధనకొండూరులోని పోస్టల్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో నూతన భవనంలోకి బుధవారం మార్చారు. నూతన భవనాన్ని ఏఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. గత 40 ఏళ్లుగా గ్రామంలో ఉన్న తపాల కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో ప్రధాన రహదారిపై ఉన్న నూతన భవనంలోకి మార్చామని తెలిపారు. స్థానిక బ్రాంచ్ పోస్టుమాస్టర్ కళ్యాణ్, సర్పంచ్ గొట్టిపాటి భవాని, గ్రామపెద్దలు జొన్నలగడ్డ లక్ష్మీనారాయణ, గొట్టిపాటి వెంకటేశ్వర్లు, గనేడి పెంచలనరసింహం, తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లు రూ.9.41కోట్లు

కావలి: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 9. 41 కోట్ల మేర పన్నులను వసూలు చేసినట్లు కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరం కంటే రూ.1.58 కోట్లు అధికంగా వసూలు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పన్ను బకాయిలపై వడ్డీని 50 శాతం మాఫీ చేయడంతో మార్చి 26 నుంచి 31వ తేదీ వరకు ఆరు రోజుల వ్యవధిలో రూ.1.26 కోట్లు వసూలు అయ్యాయని వెల్లడించారు. భారీగా పన్నులను వసూలు చేయడంలో కృషి చేసిన రెవెన్యూ అధికారి పీ ఫణికుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు షేక్ షరీఫ్, ఎస్ సురేంద్ర, వార్డు కార్యదర్శులు, తదితరులకు అభినందనలు తెలిపారు. ఆస్తి పన్ను చెల్లించిన పుర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏఎంసీ పదవిపై ఆశావహుల కన్ను

ఉదయగిరి ఏఎంసీ ఓసీ మహిళకు రిజర్వు

- తెరపైకి నేతల సతీమణులు
- బరిలో మేకపాటి, గణపం కుటుంబాలు
- తమ పేర్లు పరిశీలించాలని ఎమ్మెల్యేకు పలువురు నేతల వినతి





గణపం హరిత



మేకపాటి శాంతమ్మ



తాటికొండ అనూష

ఉదయగిరి: నామినేటెడ్ పదవుల్లో కీలకమైన ఉదయగిరి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్ పదవి కోసం పలువురు ఆశావహులు పోటీ పడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మొదటి జాబితాలో జిల్లా నుంచి కేవలం సర్వేపల్లి ఏఎంసీ కమిటీని మాత్రమే ప్రకటించారు. త్వరలో మిగిలిన కమిటీల పేర్లు ప్రకటించే అవకాశం ఉంది. ఇప్పటికే చంద్రబాబు ఏఎంసీ కమిటీలకు సంబంధించిన పేర్లను పంపించాలని ఎమ్మెల్యేలకు సూచించారు. అయినా ఇంకా జాప్యం చేస్తుండడంతో ఎమ్మెల్యేలపై అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. తాము సూచించే పేర్లకు ప్రాధాన్యత ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో పలువురు ఎమ్మెల్యేలు వేచి చూసే ధోరణిని ప్రదర్శిస్తున్నారు. ఈ క్రమంలో ఉదయగిరి ఏఎంసీ చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్న పలువురు ఆశావహులు ఎమ్మెల్యే కాకర్ల సరేష్‌పై ఒత్తిడి తెస్తున్నారు. ఉదయగిరి ఏఎంసీ చైర్‌పర్సన్ బరిలో రాజకీయ కుటుంబాలకు చెందిన పలువురు వ్యక్తులు బరిలో ఉన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెన్షన్‌కు గురై టీడీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి సతీమణి శాంతమ్మ పదవిని ఆశిస్తున్నారు. పార్టీలో చేరేటప్పుడు చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ తగిన ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత పట్టించుకోలేదు. టీటీడీ బోర్డు మెంబరు లేదా రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ పదవి శాంతమ్మకు ఇస్తారని మేకపాటి ఆశించారు. కానీ నిరాశే మిగిలింది. ఉదయగిరి ఏఎంసీ చైర్‌పర్సన్ పదవిని ఓసీ మహిళకు కేటాయించడంతో ఆమె ఆశలు పెట్టుకున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డికి కూడా ఏ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కలేదు. డీసీసీబీ పదవి ఆశిస్తున్నా అది వరించే పరిస్థితి కనిపించడం లేదు.దీంతో ఆయన తన సతిమణి అనసూయమ్మ పేరును ఏఎంసీ పదవికి పరిశీలించాలని పార్టీ పెద్దలను కోరినట్లు సమాచారం. అంతేకాకుండా కమ్మ సామాజిక వర్గానికి కేటాయించే అవకాశం ఉంటే కొండాపురం మండలానికి చెందిన ప్రస్తుత టెలీకాం బోర్డు మెంబరు తాటికొండ అనూష పేరును ఎమ్మెల్యే పరిశీలించే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కాగా వింజమూరుకు చెందిన గణపం బాలగురువారెడ్డి కుటుంబం మొదటి నుంచి టీడీపీకి విధేయతగా ఉంది. ప్రస్తుతం గణపం సుదర్శన్‌రెడ్డి పార్టీలో యువనేతగా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఓసీ జనరల్‌కు కేటాయిస్తే తనకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరుతూ వస్తున్నారు. అయితే మహిళకు రిజర్వు కావడంతో తన సతిమణి గణపం హరితకు అవకాశం ఇవ్వాలని కోరినట్లుగా తెలుస్తోంది. ఆమె విద్యావంతురాలు కూడా కావడంతో ఎమ్మెల్యే హరిత వైపు మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. ఆమె పేరును పార్టీ అధిష్టానానికి సూచించినట్లుగా కూడా ప్రచారం జరుగుతోంది. దీంతో కొందరు ఆశావహులు ఎమ్మెల్యే తీరును వ్యతిరేకిస్తూ నేరుగా పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేసినట్లుగా విశ్వసనీయ వర్గాల సమాచారం. రాష్ట్రస్థాయిలో పార్టీ పెద్దలు జోక్యం చేసుకుంటే పేరు మారే అవకాశం ఉంటుందనే ప్రచారం కూడా జరుగుతోంది. లేకపోతే హరిత పేరు దాదాపు ఖాయమని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. మొత్తం మీద త్వరలో భర్తీ చేసే 'గిరి' ఏఎంసీ పదవి ఎవరిని వరిస్తుందో అనే చర్చ టీడీపీ వర్గాల్లో నడుస్తోంది. తమకు అనుకూలంగా పరిస్థితి లేకపోతే పార్టీ పెద్దల వద్ద తాడోపేడో తెల్చుకోవాలనే ఆలోచనలో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నట్లుగా కూడా ప్రచారం జరుగుతోంది. మరి ఈ సమస్యను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఎలా అధిగమిస్తారో వేచి చూడాలి.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి



వరికుంటపాడు: వేసవిలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారిణి కరిష్మా సూచించారు. మండలంలోని కాంచెరువు గ్రామంలో 104 వాహన సేవలను బుధవారం అందజేశారు. వైద్యాధికారిణి 28 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వడదెబ్బపై అవగాహన కల్పించారు. శరీరానికి ఎక్కువగా వేడి తగలడం వల్ల డీహైడ్రేషన్‌కు గురై వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందన్నారు. మజ్జిగ, పండ్లరసాలు, ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

ఆధార్ ప్రత్యేక క్యాంపులు

ఆత్మకూరు(చేజర్ల): ప్రభుత్వ ఆదేశాల మేరకు చేజర్ల మండలంలో గురువారం నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలలిత బుధవారం తెలిపారు. గురువారం నుంచి 5వ తేదీ వరకు పాడేరు, యనమదల, నాగులవెలటూరు, 8 నుంచి 11వ తేదీ వరకు పెరుమాళ్లపాడు, కోటితీర్థం సచివాలయాల పరిధిలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిత్యం నడకతో ఆరోగ్యం



ఆత్మకూరు జెడ్పీవెస్ట్ పాఠశాలలో మొక్కను నాటుతున్న వాకర్స్

ఆత్మకూరు: ఆత్మకూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ వాకర్స్‌డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పంటవీధిలోని జెడ్పీ వెస్ట్ పాఠశాలలోని విద్యార్థులకు నిత్యం వాకింగ్, వ్యాయామం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. నిత్యం గంట సేపు వాకింగ్ చేయడం వల్ల బీపీ, షుగర్, తదితర వ్యాధులను దూరంగా ఉంచవచ్చని తెలిపారు. ఉన్నత పాఠశాలలో వాకింగ్ ట్రాక్‌ను శుభ్రపరిచారు. జెడ్పీ వెస్ట్ పాఠశాలలో మొక్కలు నాటారు. త్వరలో చెరువు వద్ద ఏర్పాటు చేయనున్న పార్కులో వాకింగ్ ట్రాక్‌ను నిర్మించాలని అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

కూలీలందరికీ పనులు కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కర్

సీతారామపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనుల పురోగతిపై ఎంపీడీఓ భాస్కర్ ఉపాధి సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పించాలని సూచించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. కొలతల ప్రకారం పనులు జరిగేలా చూసి ఉపాధి కూలీలకు గిట్టుబాటు వేతనం అందించాలన్నారు. కూలీల హాజరు శాతాన్ని పెంచాలన్నారు. అనంతరం పంచాయతీల వారీగా ఉపాధి పనుల పురోగతిపై సమీక్ష జరిపి సిబ్బందికి తగిన సూచనలు సలహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈసీ సువార్తయ్య, టీఏలు మురళి, రంగనాథ్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం దందా

సోమశిల : అనంతసాగరం మండలం వెంగంపల్లి కేంద్రంగా స్థానిక టీడీపీ నాయకులు రేషన్ బియ్యం దందా సాగిస్తున్నారు. బడా నాయకుల సిఫార్సుతో అధికారులను లోబర్చుకుని అక్రమ రవాణా సాగిస్తున్నారు. ప్రభుత్వం రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసిన వెంటనే లబ్ధిదారుల వద్దకు వెళ్లి బియ్యాన్ని కిలో రూ.15కు కొనుగోలు చేస్తున్నారు. ఇలా మండలంలోని అన్ని గ్రామాల నుంచి సేకరించిన బియ్యాన్ని వెంగంపల్లిలో నిల్వ చేస్తున్నారు. అనంతరం రాత్రి వేళల్లో గుట్టు చప్పుడు కాకుండా లారీలో నెల్లూరు, కావలిలోని రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. అక్కడ కిలో రూ.30 వరకు విక్రయిస్తున్నారు. ఇలా ప్రతినెలా 40 టన్నులకుపైగా బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తూ లక్షలు సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం.



రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటో

సీతారాముల ఉత్సవ విగ్రహాలకు సంప్రోక్షణ

వరికుంటపాడు: స్థానిక కోదండరామస్వామి ఆలయంలో నూతన సీతారాముల ఉత్సవ విగ్రహాలకు సంప్రోక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఉదయం గోపూజ, గ్రామ ప్రదక్షిణ, గణపతిపూజ, అంకురార్పణ దీక్ష, వాస్తుమూలమంత్ర హోమం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను కదిరి సోదరులు అందజేశారు.

సోము వీర్రాజుకు శుభాకాంక్షలు

ఆత్మకూరురూరల్: ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన సోము వీర్రాజును ఆత్మకూరుకు చెందిన పలువురు బీజేపీ నాయకులు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేవైఎం రాష్ట్ర నాయకులు అల్లంపాటి సాంబశివారెడ్డి, తదితరులు ఉన్నారు.

మర్యాదపూర్వకంగా..

ఉదయగిరి: విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గొల్ల నరసింహయాదవ్‌ను రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పీ చెంచలబాబు యాదవ్, దుత్తలూరు మాజీ ఎంపీపీ శ్రీకుర్తి రవీంద్రబాబు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. యాదవుల సంక్షేమానికి కృషిచేయాలని కోరారు.

ఆదిఆంధ్ర పాఠశాలను విలీనం చేయొద్దు



సమావేశానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు



మాట్లాడుతున్న ఎంఈఓలు

ఆత్మకూరు: పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ సమీపంలోని దళితకాలనీలో ఉన్న ఆదిఆంధ్ర ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను ఎల్ఆర్‌పల్లి పాఠశాలలో విలీనం చేయొద్దని స్థానికులు విజ్ఞప్తి చేశారు. బుధవారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఎంఈఓలు జ్యోతి, చలపతి సమావేశం నిర్వహించారు. జీఓ 117 మేరకు పాఠశాలలోని 3,4,5 తరగతులను ఎల్ఆర్‌పల్లి పాఠశాలలో విలీనం చేసే విషయమై చర్చించారు. ఈ సందర్భంగా 12, 13 వార్డులకు చెందిన యువకులు, పాఠశాల పూర్వ విద్యార్థులు, పాఠశాల పరిరక్షణ కమిటీ సభ్యులు తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో వేయికి పైగా ఇళ్లు ఉన్నాయని, పేదల పిల్లలే ఎక్కువగా పాఠశాలలో చదువుతున్నారని, ఎట్టి పరిస్థితిలోనూ తరగతులను తరలించేందుకు వీల్లేదని తీర్మానం చేస్తూ లిఖిత పూర్వకంగా విద్యాశాఖ అధికారులకు అందజేశారు.

ప్రమాదభరితంగా మలుపులు



హెచ్చరిక బోర్డులేని ఇందుపూరు సమీపంలోని భారీ మలుపు

అల్లూరు: మండలంలో పలు చోట్ల రోడ్ల మలుపులు ప్రమాదభరితంగా ఉన్నాయి. . అల్లూరు–ఇందుపూరు రోడ్డులో నాలుగు భారీ మలుపులు ఉన్నాయి. అదే రోడ్డులో పురిణి సమీపంలో రెండు భారీ మలుపులు ఉన్నాయి. అలాగే నార్తుమోపూరు–కొత్తపాళెం రోడ్డు, అల్లూరు– తూర్పుగోగులపల్లి, పడమరగోగులపల్లి వెళ్లే రోడ్లలోనూ భారీ మలుపులు ఉన్నాయి. అల్లూరు–ఇస్కపల్లికి, అల్లూరు–నార్త్ఆములూరు, అల్లూరు– గ్రద్దగుంట రోడ్లలోనూ భారీలు మలుపులు ఉన్నాయి. మలుపులు వద్ద స్పీడ్‌బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనచోదకులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ప్రమాద సూచిక బోర్డులు, స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పొలాల మధ్యలో రోడ్డు నిర్మాణం

వెన్నవాడలో రైతులు అభ్యంతరం

- జీవనోపాధి కోల్పోతామని ఆవేదన
- డిజైన్‌ను మార్చాలని ఆర్డీఓకు వినతి



రోడ్డు పనులు చేపడుతుండగా జేసీబీ కింద కూర్చుని అడ్డుకున్న రైతు

ఆత్మకూరు: ఆత్మకూరు మండలం రామస్వామిపల్లి నుంచి డీసీపల్లి, వెన్నవాడ, పడకండ్ల, గండ్లవేడు మీదుగా వింజమూరు మండలం నల్లగొండ్ల వరకు నూతనంగా రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. అందులో భాగంగా వెన్నవాడ గ్రామంలో పొలాల మధ్యలో రోడ్డు నిర్మాణం చేపడుతుండడంపై బాధిత రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణంతో జీవనోపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు డిజైన్ మార్చాలని అధికారులను వేడుకుంటున్నారు. గతంలో ప్రభుత్వం వెన్నవాడకు చెందిన జగన్నాథం నరసింహులుకు సర్వే నంబరు 530లో 2.50 ఎకరాలు, చలమయ్యకు సర్వే నంబరు 92–2–10లో 1.75 సెంట్లు, పసుపులేటి తిరుపాలుకు సర్వే నంబరు 92–1–1లో 1.50 ఎకరాలను మంజూరు చేసింది. అలాగే గ్రామానికి చెందిన జే బాలమ్మకు సర్వే నంబరు 92–1లో 1.50 ఎకరాల సొంత భూమి ఉంది. వారు నాలుగు దశాబ్దాలకు పైగా భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే రామస్వామిపల్లి– నల్లగొండ్ల రోడ్డు నిర్మాణాన్ని వెన్నవాడలో పొలాల మధ్యలో చేపట్టేలా డిజైన్ రూపొందించడంతో రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పొలాల మధ్యలో రోడ్డు నిర్మాణం చేపడితే జీవనోపాధి కోల్పోతామని, ఓ పక్కకు డిజైన్ మార్చాలని అధికారులకు విన్నవించుకున్నారు. అయినా డిజైన్ మేరకే రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు కాంట్రాక్టర్ మంగళవారం జేసీబీతో పనులు మొదలుపెట్టగా బాధిత రైతులు అడ్డుకున్నారు. ఓ రైతు జేసీబీ కింద కూర్చుని నిరసన తెలిపాడు. దీంతో విషయం తెలుసుకున్న అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని నష్టపోయే రైతులకు సమీపంలోనే ప్రభుత్వ భూమిలో 20 సెంట్ల చొప్పున కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అందుకు రైతులు అంగీకరించలేదు. భూమి మధ్యలో గాకుండా డిజైన్ మార్చి ఓ పక్కగా పనులు చేపట్టాలని వేడుకున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేశారు. బుధవారం బాధిత రైతులు ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావనిని కలిసి వినతి పత్రం అందజేశారు.

రోడ్డు ప్లాన్ మార్చండి



మా గ్రామం మీదుగా రోడ్డు వేయడం మాకు మంచిదే. మేము స్వాగతిస్తాం. అయితే రైతులను ఇబ్బంది పెట్టి రోడ్డు వేయడం సరికాదు. నలుగురు, ఐదుగురు రైతులకు నష్టం కలిగించేలా కాకుండా భూముల శివార్లలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని వేడుకుంటున్నాం.

–జే నరసింహులు, రైతు, వెన్నవాడ

ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం

రోడ్డు నిర్మాణానికి సంబంధించి డిజైన్లు ఖరారు చేసిన తరువాత ఇప్పుడు అభ్యంతరం తెలపడం సరికాదు. ప్రభుత్వం పంపిణీ చేసిన భూములను ప్రజావసరాల కోసం తీసుకోవడం సహజమే. ప్రత్యామ్నాయంగా ఒక్కొక్కరికి కోల్పోయే 20 సెంట్ల చొప్పున భూమిని సమీపంలోని ప్రభుత్వ భూమిలో కేటాయిస్తాం. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం.

–బీ పావని, ఆర్డీఓ, ఆత్మకూరు


40 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నాం



40 ఏళ్లుగా భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మా తండ్రి వెంకటయ్యకు అప్పట్లో ప్రభుత్వం భూమిని ఇచ్చింది. దానికి సంబంధించి పాసుపుస్తకాలు, అండగల్లు ఉన్నాయి. రోడ్డు నిర్మాణానికి అభ్యంతరం లేదు. భూమి మధ్యలో కాకుండా ఓ పక్కగా నిర్మించాలని వేడుకుంటున్నాం. మా బాధను అధికారులు ఆలకించాలి.

–జగన్నాథం చలమయ్య, వెన్నవాడ

నోటికాడ కూడు తీయొద్దు



కొన్నేళ్లుగా భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నాం. ఇప్పుడు భూమి మధ్యలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ హడావుడి చేస్తున్నారు. ఓ వైపు మేము అధికారులను ఓ పక్కగా రోడ్డు నిర్మించాలని వేడుకుంటుంటే కాంట్రాక్టర్ భూమి మధ్యలో పనులు చేపట్టేందుకు జెండాలు పాతడం దారుణం. మా నోటికాడ కూడు తీసేయడం ధర్మకాదు. ప్రభుత్వాధికారులు సానుకూలంగా స్పందించి రోడ్డు ప్లాన్‌ను మార్చాలి.

–లక్ష్మమ్మ, వెన్నవాడ

సర్వేలను సకాలంలో పూర్తి చేయాలి



సీతారామపురం : ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను సచివాలయ సిబ్బంది సకాలంలో పూర్తి చేయాలని ఈఓపీఆర్డీ భార్గవి సూచించారు. మండలంలోని బాలాయపల్లి సచివాలయాన్ని బుధవారం ఆమె సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది సమయాన్ని పాటించాలని, లేకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. తడి పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేసి హరితరాయబారులు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు అందజేయాలని సూచించారు. ఆమెవెంట పంచాయతీ కార్యదర్శి జీవన్‌కుమార్ ఉన్నారు.

వెలుగు సిబ్బందిపై చర్యలేవీ..?

రాపూరు: వెలుగు కార్యాలయంలో నిధులను స్వాహా చేసిన సిబ్బందిపై ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంపై ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దల మునెయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రూ.1.41 కోట్ల నిధుల గోల్‌మాల్ జరిగినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. దీంతో తొమ్మిది మంది డీఆర్‌డీఏ సిబ్బందిపై విచారణకు ఆదేశించారని తెలిపారు. యానాది సమాఖ్య, మహిళా సమాఖ్యలో విచారణ జరిపి ఏడుగురు సిబ్బంది అవినీతికి పాల్పడినట్లు డీఆర్‌డీఏ పీడీకి నివేదిక అందించినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు.